

# ..పిలిచేవారుంటే నడిచేను నేను...

**కోరుకొండ సత్యానంద్**

• మేసింది. జాగ్రత్తగా పరిశీలించేడు అన్ని టేబుళ్ళను. టేబుల్ని సెలక్ట్ చేసుకోవడంలో రెండు సూత్రాలున్నాయి మూర్తికి. ఒకటి ... కిచెన్లోంచి సర్వర్లొచ్చే ద్వారానికి దగ్గర్లో ఉండాలి. అలా ఉంటే టిఫిన్లు చల్లారిపోకుండా అందుతాయి. పదే పదే అడిగే చెట్నీలు, సాంబార్లు వెంట వెంటనే వస్తాయి. అదీకాక ఏ సర్వరు ఏ టిఫిన్ పట్టుకెళ్ళినా కన్పిస్తుంది. కాబట్టి తనను ఎట్రాక్ట్ చేసిన వెరైటీ టిఫిన్లను ఆర్డరివ్వొచ్చు ఇక రెండోది ... తను కూర్చొనే టేబుల్ దగ్గర తను తప్ప ఎవరూ ఉండగూడదు. వాళ్ళ కళ్ళు తన తిండి మీద పడగూడదు. అలా పడిన కొన్ని సందర్భాల్లో చాలా ఇబ్బంది పడ్డాడు తిన్నది అరగక.

అనువైన టేబుల్ దొరికాక ముందొక టిఫిన్‌కు ఆర్డరిచ్చేడు. అది తిన్నాక చాలా బాగుందనిపించింది. సర్వర్లందరూ పెట్టుకెళ్తోన్న టిఫిన్లను బాగా పరిశీలించి తననాకర్షించిన టిఫిన్లు కూడా చెప్పేడు. సర్వరు మంచివాడు. క్షణాల్లో తెచ్చేస్తున్నాడు. చెట్నీ పెద్ద కప్పుతో పెట్టేసేడు. మూర్తి బలహీనత తెలిసిందే కదా. ఆ కప్పుడు చెట్నీ అయిపోయే వరకూ టిఫిన్లు తిన్నాడు. మొత్తం ఆరు ప్లేట్లు. డ్యూటీలో నిద్దరొస్తుందేమోనని టీ కూడా చెప్పేడు. టీ త్రాగుతూ సర్వర్‌కి రెండు రూపాయలు టిప్పుగా ఇద్దామనుకున్నాడు.

సర్వరు బిల్లు తెచ్చేడు. మూర్తి చొక్కా జేబులో చేయి పెట్టేడు. తర్వాత ఫాంటు జేబులో చేయి పెట్టేడు. అప్పటిగ్గానీ కంగారు కలగలేదు ఆనంద మూర్తికి. వెంటనే స్ప్రింగులా లేచి ఆదరాబాదరాగా చొక్కాకి, పాంటుకీ ఉన్న జేబులన్నీ చూసుకున్నాడు.

అనుభవం ఉన్న పోలీసు ఎదుటి వ్యక్తి హావభావాల్ని బట్టి ఎవరేమిటో ఎలా పసిగట్టగలడో, అనుభవం ఉన్న సర్వరూ కస్టమరు బిహేవియర్ని బట్టి విషయాన్ని పసిగట్టగలడు.

జేబులన్నీ వెతుక్కొని కళ్ళు తేలేసి చూస్తున్న మూర్తితో "ఇంకేం వెదక్కండి. జేబులో డబ్బులుండవు. నడవండి కౌంటర్ దగ్గరికి" అన్నాడు సర్వరు.

ఆనందమూర్తి కదిలాడు బెరుగ్గా సర్వరు వైపు చూస్తూ. కౌంటర్ దగ్గరకు ఎలా వెళ్ళాడో., కౌంటర్లో వ్యక్తికి ఏదో చెప్పబోతుంటే సర్వరు అడ్డొచ్చి విషయం చెప్పేడు. కౌంటర్లో వ్యక్తి వెటకారంగా చూసేడు మూర్తి వైపు. ఆ చూపుకి ఒళ్ళు చచ్చిపోయినట్లయ్యింది. అయినా నోరు విప్పి అన్నాడు.

"లూనా ఉంది సార్. ఇంటికెళ్ళి తెచ్చిచ్చేస్తాను"

కౌంటర్లో వ్యక్తి వంకరగా నవ్వేడు.

"పొద్దున్నే కంగారుగా బీరువాలో బట్టలు తీసి వేసుకొని వచ్చేసాను సార్. నిన్నటి బట్టల్లో డబ్బులు తీసి వేసుకోవడం మరచిపోయేను సార్"

"ఈ ఊళ్ళో కొత్తగా హోటల్ పెట్టొచ్చు. కానీ హోటల్ నడపడం కొత్తకాదు నాకు"

"పోనీ వాచీ ఉంది ఉంచండి సార్"

"వాచీలు, ఉంగరాల దొంగల్ని పోలీసులు పట్టుకుంటే మాకమ్మేమని చెప్తారు. అలాంటివేమీ వద్దుగానీ నీలాంటి వాళ్ళకి ఒక సంవత్సరం క్రిందటే ఒక పద్ధతి కనిపెట్టేనులే, అది అమలు చేస్తాను"

పప్పు రుబ్బించడమో, ప్లేట్లు కడిగించడమో చేస్తాడని భయమేసింది మూర్తికి. "సార్. పోనీ లూనా ఉంచండి. రిక్షాలో వెళ్ళి డబ్బులు తెస్తాను" అని లూనా తాళాలు అందించేడు.

కౌంటర్లో వ్యక్తి లూనా తాళాలు అందుకొని "చూడూ. ఇంత టిఫిన్ తిన్నావంటే నువ్వెన్ని పూటలు తిండి లేకుండా ఉన్నావో, తిండిలేని వాడికి లూనా ఉందంటే అదెవరిదయ్యుంటుందో పాపం. ఇస్త్రీ బట్టలేసుకుంటే మోసపోతామనుకోకు!" అన్నాడు.

"సార్. మర్యాదగా మాట్లాడండి"

"డబ్బులిక్కడ పెట్టి అను ఆ మాట. వాచీలు. లూనాలూ పెట్టి కాదు!"

అప్పుడు చుట్టూ చూసాడు ఆనందమూర్తి. తెలిసిన వాళ్ళెవరైనా కన్పిస్తారేమోనని. కానీ ఎవరూ కన్పించలేదు. ఎలా కన్పిస్తారు. తను తిని చెప్తేగానీ తెలిసిన వాళ్ళెవ్వరూ కొత్త హోటల్‌కి రారు కదా.

"ఒరేయ్ సుందరం. రవ్వ, మసాలా, ఉల్లి, సెవెంటీ ఎమ్మెమ్ ఒకొక్కటీ చెప్పరా. ఈయన గారి పని చూద్దాం" అన్నాడు కౌంటర్లో వ్యక్తి సర్వర్తో.

సర్వర్ ఈలేసుకుంటూ వెళ్ళేడు. పది నిముషాల్లో ఒక పోలిథిన్ సంచితో వచ్చేడు.

"ఊఁ ... ఇంక తీసుకెళ్ళు"

"కదలవయ్యా"

ఆనందమూర్తి కదిలేడు. జేబులోంచి తాళం తీస్తూ ఒక సైకిలు దగ్గరకెళ్ళేడు సర్వరు. సైకిలు తాళం తీసి మూర్తి వైపు తిరిగి 'సైకిలు తియ్యి' అని ఆర్డరేసేడు..

"ఎందుకు" అని అడిగేడు మూర్తి.

"సైకిలు తీసి తొక్కవయ్యా. చెప్తాను"

ఆనందమూర్తికి తప్పలేదు. సైకిలు అందుకున్నాడు. "ఊఁ ... ఎక్కు" అన్నాడు. సర్వరు. మూర్తి సైకిలెక్కేడు. 'తిన్నగా పోనియ్' అని వెనుక దోశెల సంచితో ఎక్కేడు సర్వరు.

అంతా ఎత్తు పల్లాల గతుకుల రోడ్డు. అందులో డబుల్స్. ఫర్లాంగు వెళ్ళేడో లేదో చెమట ప్రవాహంలా కారిపోతోంది. గుండె దడ దడా కొట్టుకుంటోంది. మరి కాసేపటికి చేతులూ కాళ్ళూ వణికిపోతున్నాయి. బయల్దేరేటప్పుడు అసలేం జరుగుతుందో అన్న అయోమయ స్థితిలో లూనా సంగతే మరచిపోయేడు. ఇప్పుడు గుర్తొచ్చిందది. అదే అన్నాడు సర్వర్తో ఒగరుస్తూ.

ఈ ఆపరేషన్ సక్సెస్ అయితే నాకు ప్రమోషన్ వస్తుందని ఆపరేషన్ కత్తులు చేతపట్టుకున్న వ్యక్తి పేషెంట్‌తో అన్నాడు. ఒకవేళ నేను బతకలేదంటే 'డాక్టరు'గారు అన్నాడు పేషెంట్.

'నన్ను కంపౌండర్‌గానే ఉంచేస్తారు అన్నాడు నిదానంగా!'

రజిత
కుమ్మర్‌పల్లి, నిజామాబాద్.



"తొక్కవయ్యా. పెద్ద లూనా మీదే ఎల్లేవోడివి దిగొచ్చేవు గానీ"

అలా అరగంటపైనే తొక్కేడు. గుండెలవిసిపోయి కళ్ళు తిరిగి దబ్బున పడిపోయేవాడే వెనక్కూర్చున్న సర్వరు 'ఆ బిల్డింగ్ కాడ ఆపు' అనకపోతే. ఆగిం తర్వాత కళ్ళు బైర్లు కమ్మినట్లయ్యింది.

అదొక పెద్ద భవనం. ఎదురుగా గార్డెన్. చుట్టూ ప్రహారీ. సర్వరు గేటు తీసుకొని లోపలకు వెళ్తూ మూర్తి వైపు చూశాడు ఫాలో అవ్వమన్నట్టు. తనేమిటో, తనకేం జరగబోతోందో తెలియక తికమక పడుతూ మూర్తి అనుసరించేడు. సర్వర్ కాలింగ్ బెల్ స్విచ్ నొక్కుతూ దోశెల సంచిని మూర్తికి అందించేడు. రాజకోట సింహద్వారం తెరచుకున్నట్టు పెద్ద టేకు తలుపు తెరుచుకుంది. ఇద్దరూ లోపలకు ప్రవేశించేరు. ఎండలో సైకిలు తొక్కేడేమో, బైర్లు కమ్మిన మూర్తి కళ్ళకు ఏమీ కన్పించలేదు. గుడ్డి వాడిలాగా నడిచేడు. కాసేపటికి అన్నీ కన్పించసాగేయి. ఖరీదైన సోఫాలు, సామాన్లున్న పెద్ద వరండా దాటేక ఎదురుగా ఉన్న ఒక గది దగ్గర సర్వర్ ఆగేడు. మూర్తి ఆ గది లోపలకు చూసేడు.

గది మధ్యలో గుండ్రని రివాల్వింగ్ కాట్. దాని మీద మెత్తని పరుపు. ఆ పరుపు మీద తలను చేతికి ఆన్చి, ఒక కాలు క్రింద, రెండో కాలు కాట్ మీద పెట్టుకొని పడుకొని ఉందొకావిడ. ఫోజైతే బ్రహ్మాండంగా ఉందిగానీ మనిషి బ్రహ్మరాక్షసిలా ఉంది. కాట్ మీద పెట్టుకున్న కాలిని పనిమనిషి దబ్బు దబ్బున గుద్దుతోంది.

సర్వర్ని చూసి ఆవిడ స్విచ్ నొక్కింది. తిరుగుతున్న కాట్ ఆగింది. ఆమె దగ్గరకు వినయంగా గూనివాడిలా వెళ్ళి "నమస్తే మేడమ్. ఇవాళో బ్రహ్మాండమైన గొర్రెపోతులాంటి కేసు తగిలింది అన్నాడు సర్వరు. ఆమె కిళ్ళీగారపట్టిన పెద్ద పెద్ద పళ్ళు కొద్దిగా బయటకు కన్పించేలా చిర్నవ్వు నవ్వింది.

"ఏయ్, ఇలా రా! మండోదరీ దేవిగారికి నమస్కారం చేయి" అన్నాడు. అప్రయత్నంగానే మండోదరీ దేవికి (ఇకమీదట 'మందేవి' అనుకుందాం) నమస్కారం చేశారు మూర్తి.

"మేడమ్! ఈ కేసుని మీకు హేండోవర్ చేయమన్నారు అయ్యగారు. హోటల్ బిజీగా ఉంది. నే వెళ్ళొస్తాను" అని సర్వరు నిష్క్రమించాడు. వెళ్ళిపోతున్న సర్వరువైపు వెర్రివాడిలా చేసి ఆ తర్వాత మందేవి వైపు చూశాడు. మందేవి అప్పుడే మంచం దిగింది.

"ఆ సంచి అక్కడ పెట్టు. నాక టైమ్ వేస్ట్ చేయడం ఇష్టం ఉండదు!"

గోడకి జారేసిన ఇత్తడి సామాన్లు ఒక్కసారిగా దొర్లి పడిపోయినట్లుగా ఉన్న మందేవి కంఠస్వరానికి ఉలిక్కిపడి దోశెల సంచిని పక్కనున్న బల్ల మీద పెట్టాడు. మందేవి మదగజంలా ఆ గది లోంచి కదిలింది. మందేవిని అనుసరించమని పనిమనిషి సైగ చేసింది. తల్లి ఏనుగు వెనుక పిల్ల ఏనుగులా మూర్తి మందేవిని అనుసరించాడు. మందేవి పెరట్లోకి వెళ్ళింది. తర్వాత చప్పట్లు కొట్టింది. పనిమనిషి పరుగెత్తుకొచ్చి కొంగులో ఉన్నవాటిని నూతి చప్టా మీద గుమ్మరించి వచ్చినంత హడావుడిగా వెళ్ళిపోయింది. చప్టామీద గుమ్మరించినవాటివైపు చూశాడు మూర్తి.

ప్రఖ్యాత కంపెనీవారి మహాబార్‌లు డజనుపైనే ఉన్నాయి. అంతలో పనిమనిషి రెండు చేతులతోనూ పట్టినన్ని బట్టలు తెచ్చిపడేసి వెళ్ళిపోయింది. వెళ్ళిపోయి మళ్ళీ మరికొన్ని బట్టలు తెచ్చింది. మళ్ళీ వెళ్ళింది. బట్టలు తెచ్చింది. మళ్ళీ వెళ్ళింది... తెచ్చింది.

"నీకు సీను అర్థమైపోయే ఉంటుంది. ఇంక మొదలెట్టు" అని అక్కడున్న గట్టు మీద కూర్చుంది మందేవి. బిక్కమొహం వేసుకుని అటూ ఇటూ చూస్తూంటే మరికొన్ని బట్టలు తెచ్చిపడేసిన పనిమనిషి అంది —

"నీళ్ళకోసం చూస్తున్నావా, బావి ఉంది కదా! ఇదిగో చేద, ముప్పై మీటర్ల తాడూను."

"చెప్పాను కదా, నాకు టైమ్ వేస్ట్ చేయడం ఇష్టం ఉండదని, ఊ... మొదలెట్టు."

మూర్తి పీట మీద కూర్చుని పని మొదలుపెట్టాడు. పనిమనిషి లోపలకెళ్ళి దోశెల సంచి తెచ్చిచ్చింది మందేవికి. చీరలు నీట్లో వేసి తీసి మహాబార్‌తో రుద్దుతుంటే మూర్తి కండరాలన్నీ కదలమని మొరాయిస్తూ చెమట కన్నీరు కారుస్తున్నాయి. దోశెలు తింటూ మూర్తి పనిని సూపర్‌వైజ్ చేస్తోంది మందేవి. మూర్తి నాలుగు చీరలు ఉతికేసరికి నాలుగు దోశెలూ తినేసింది మందేవి.

"చిట్టెమ్మా! టిఫెను తిన్నాను కదా! కునుకు తీయకపోతే ఒళ్ళు తూలుతుంది కదా. ఇంక నువ్వు చూసుకో!" అని మందేవి గట్టు మీద నుండి కిందకు గెంతి లోపలకు వెళ్ళిపోయింది. మందేవి గెంతినప్పుడు మూర్తికేమీ అవలేదు కానీ పనిమనిషి మాత్రం గోడకు ఆనుకోకపోతే ప్రక్కకొరిగిపోయేదే. మూర్తి పక్కనున్న బకెట్టూ, చెంబూ మాత్రం ఒక దొర్లు దొర్లాయి. చిన్న జేబురుమాలు మిగిలితే సబ్బు, సబ్బు చిన్న ముక్క మిగిలితే రెండు దుప్పట్లూ అందిస్తోంది పనిమనిషి. ఎప్పటికో గానీ సబ్బు, బట్టలు ఒక్కసారే అవ్వలేదు. అప్పటికి చెమటతో తడిసి ముద్దయిపోయాడు మూర్తి. కండరాలన్నీ వదులైపోయి, నరాలన్నీ నజ్జు నజ్జయిపోయాయి.

అంతలో లోపల్నుంచి చప్పట్లు వినిపిస్తే కంగారుగా వెళ్ళింది పనిమనిషి. వచ్చి "అమ్మగారు లేచి భోంచేస్తున్నారు. నిన్ను రమ్మంటున్నారు" అంది.

ఆ మాటకు ప్రాణం లేచొచ్చింది మూర్తికి. లోపలకు వెళ్ళాడు. డైనింగ్ టేబుల్ మీద అన్నం కూరల్తోపాటు బూరెలు, సున్నుండలు, చెక్కడాలూ, బెల్లంకారపూ్పస అచ్చులు ... రకరకాల పదార్థాలున్నాయి. ఉన్న ఒకే ఒక కూర్చీ మీద కూర్చుని మందేవి 'లంచ్' కానిస్తుంది. నోట్లో రెండు సున్నుండలు పెట్టుకోబోతూ ఆగి, "ఆ కింద కూర్చో" అంది మూర్తితో.

ఆనందమూర్తి గచ్చుమీద బాచింమటం వేసుకుని కూర్చున్నాడు. కడుపులో ఎలకలు కిచకిచమంటుంటే, 'ఎక్కడైతే ఏంలే' అనుకున్నాడు.

"... నా దదోరకం జబ్బు బాబూ! బోలెడు టెస్టులు చేసిన స్పెషలిస్టులు 'స్కిజోఫెర్నొబార్నవిటా బోర్నడ్ విత్ గోల్డెన్ స్పూన్' అని తేల్చారు. ఈ జబ్బుకి మందులు లేవు. ఒకే ఒక్క జాగ్రత్త తీసుకోవాలి. కడుపెప్పుడూ వీసమెత్తు ఖాళీ ఉండకుండా చూసుకోవాలి. అందుకే నాకు తిండి లేనోళ్ళను చూస్తుంటే ఈర్ష్యగా ఉంటుంద. వాళ్ళించక్కా ఆకలితో నకనకలాడుతూ ఉండొచ్చు కదా. ఏం చేస్తాం, తిండిలేని జనాలంటే ఎంతో పెట్టి పుట్టాలి. ఆఁ... ఇదేమిటే చిట్టెమ్మా వీడు 'కేసు' అని గుర్తుచేయవేమిటే? అనవరంగా నా కష్టాలన్నీ చెప్పుకుంటున్నాను. వెళ్ళి పట్టుకురా ఇతనికి" అంది మందేవి అంతలోనే సీరియస్సైపోతూ.

'సీరియస్సైతే నాకేం, జోవియల్ అయితే నాకేం. పెట్టింది తినేస్తే ఈ పూట గడిచిపోతుంది కదా' అనుకున్నాడు మూర్తి మనస్సులో. లోపలకు వెళ్ళిన పనిమనిషి ఒక పెద్ద ప్లేటుతో వచ్చింది. ఆబగా ఆ ప్లేటువైపు చూసిన మూర్తి అవాక్కయిపోయాడు. ఎందుకంటే అందులో ఉన్నది మూర్తి కోసం 'లంచ్' కాదు.

"అమ్మగారికి భోజనం చేసిన వెంటనే కిళ్ళీ అలవాటు. ఈ రెండు కేజీల పోకలూ కత్తిరించేస్తే ఓ పదిరోజులొస్తాయి. జాగ త్తగా తింటే" అంటూ అడకత్తెరొకటి అందించింది.

వస్తున్న కోపాన్ని అమచుకుంటూ నెమ్మదిగా అన్నాడు మూర్తి. నేను కూడా అన్నం తిన్నాక కత్తిరిస్తానేం, ప్లీజ్!"

"ఏంటీ, అన్నమా నీకా. నువ్వు కేసువి. కేర్‌ఫుల్‌గా పన్జేసుకోవాలి కానీ కడుపు గురించి ఆలో

ంచకూడదు. ఆరుదంటల్దాకా" గమ్మంది పని మినిషి. ఆనందమూర్తికి ఏడుపొక్కటే తక్కువ.

ఆలోచిస్తున్నావేంటి. నా భోజనం అయిపోయింది. త్వరగా కానీయ్" నోట్లో ముద్ద పెట్టుకుంటూ గద్దించింది మందేవి. మూర్తికి పని మొదలెట్టక తప్పలేదు.

భోజనం పూర్తి చేసి ఆరాకుల్లో చెంచాడు సున్నం, గుప్పెడు వక్కా వేసుకుని నోట్లో కుక్కుకుంది మందేవి. ఆ తర్వాత పనిమనిషి మూర్తి ఎదురుగా కూర్చుని విందారగించింది. ఒక గంటకు పోకలు కత్తిరించడం అయింది. బట్టలుతికి నానిన చేతుల్తో అడకత్తెరతో పనిచేశాడేమో మూర్తి చేతులు బొబ్బలెక్కాయి. అంతవరకూ సోఫాలో జ్ఞారుబడిన మందేవి లేచింది.

"ఆ పని అయిందా. కాస్తం నడుం వాలుస్తాను కానీ నేను లేచేలోగా నవారు మంచాలు నాలుగున్నాయి. నవార్లు ఒదులైపోయాయి. గట్టిగా బిగించెయ్" అంది.

ఇందాక పోకలు కత్తిరించమన్నప్పుడే బరస్ట్ అయ్యేవాడు మూర్తి. అప్పుడెలాగో తమాయించుకున్నాడు గానీ ఇప్పుడింగ ఆగలేకపోయాడు. మూర్తి నోట్లోంచి మాటలు తూటాల్లా వచ్చాయి.

"మండోదరీ దేవీ! తప్పు చేశాను కాబట్టి తల వంచాను. నిజానికి ఆనందమూర్తి అంటే ఆషామాషీ కాదు. నా సంకల్పం వజ్రం. నేనొక దుర్గం. నా మాట ఒక బాహాటా. కసితో బుసకొడుతున్న కాలనాగుని నేను. జూలు విదిల్చి పంజా విప్పి ఉన్న సింహాన్ని నేను. ఇంతవరకూ కారిన నా చెమట సాక్షిగా చెప్తున్నాను. ఇంక నువ్వే పని చెప్పినా చేయను. ఇదిగో వెళ్ళిపోతున్నాను."

ఒక క్షణం విస్తుపోయిన మందేవి స్పృలోకి వచ్చి అంది —"అలాగే వెళ్ళిపో వె...ళ్ళ...గ...లి...గి...తే..!" నొక్కి పెట్టి అన్న ఆ చివర పదం గురించి ఆలోచిస్తుంటే, "చిట్టెమ్మా, ఆ గది తలుపులు తెరవ్వే. వీడి పని మన జండూ, జాలిమ్‌లే చూసుకుంటాయి" అంది.

మందేవి మాటలు అర్థం కాక పనిమనిషి వెళ్తున్న వైపు చూశాడు మూర్తి. పనిమనిషి ఆ పక్క గది తలుపులు తీసింది. లోపల్నుంచి రెండు జాతి కుక్కలు ఉరుక్కుంటూ వచ్చాయి.

"ఒకడోసారి నీలాగే నీలిగాడు. నేను వీటితో 'ఉఁ' అన్నానంతే. చెరోపక్కా తినేసి నా వైపు చూశాయి. ఆగమన్నాను కాబట్టి ఆగాయి. బొడ్డు చుట్టూ నూట ఎనభై ఇంజక్షన్లు తీసుకుంటే గానీ పుండు తగ్గలేదు. కండ ఇప్పటికీ రాలేదు. చెప్పు. 'ఉఁ' అనమంటావా?"

ఆనందమూర్తి ఆ రెండు కుక్కలవైపూ ఒకసారి చూశాడు పరిశీలనగా. అవి ఆవురావురుమంటున్న సింహాల్లా ఉన్నాయి. అంతవరకూ ఎగదన్నుకొచ్చిన ఆవేశం ఒక్కసారిగా చల్లారిపోయింది. ఆనందమూర్తిగి ఆగిపోక తప్పలేదు. మారు మాట్లాడకుండా పనిలో పడిపోయాడు.

నాలుగు నవ్వారు మంచాల్ని బిగించాడు. గదులన్నీ ఫినాయిల్తో కడిగాడు. పెరడు, తోట శుభ్రం చేశాడు. పనికిరాని సామాన్లన్నీ అటకెక్కించాడు. అంట్లు తోమాడు.

గడియారం ఆరు గంటలు కొట్టింది. అప్పుడొచ్చింది మందేవి లేవెట్రీ దగ్గరకు. అప్పటికి ఆనందమూర్తి చేతిలో పీచుకర్ర ఉంది.

"ఏవండీ, టైము ఆరయ్యింది. ఇంక మీరు వెళ్ళొచ్చు."

ఆనందమూర్తి ఆశ్చర్యంగా, సంశయంగా అటూ ఇటూ చూశాడు.

"నేను మాట్లాడుతోంది మీతోనే. ఆరు దాటింది కాబట్టి గౌరవంగా మాట్లాడుతున్నాను. ఆ పని వదిలేసి మీరు వెళ్ళరండి. సారీ, వెళ్ళండి. బెస్టాఫ్ లక్!"

మందేవి మంద్రస్థాయి గొంతుకు తన్మయం చెంది ఆనందమూర్తి అక్కడ్నుంచి వెళ్ళబోతుంటే, "ఎక్స్‌క్యూజ్ మీ. చిన్న మాట. మీ రేమీ అనుకోనంటే ..." అంది మందేవి.

"చెప్పండి, చేసేసి వెళ్ళిపోతాను."

"నేను చెప్పబోయేది వర్క్ గురించి కాదు. వర్డ్ ... జీవితంలో చిన్న తప్పులే పెద్ద పెద్ద సమస్యలకు కారణాలవుతాయి. ఇకమీదట ఎక్కడికైనా వెళ్ళబోయేముందు. కనీసం ఏమైనా కొనబోయేముందు, తినబోయే ముందు జేబులో డబ్బులున్నాయో లేదో చూసుకోండి. ఈ సూక్తిని జీవితాంతం గుర్తుంచుకోండి. సర్వరు మీలూనా తెచ్చి పెట్టాడు. వెళ్ళండి."

ఇరవై నిమిషాల్లో ఇంటికి చేరుకున్నాడు మూర్తి. తుఫానులో మరో రాష్ట్రం నుండి మన రాష్ట్రానికి కొట్టుకొచ్చిన చీపురుకట్టలా ఉన్న భర్తని చూసి గాభరా పడింది మూర్తి భార్య. మూర్తి ఏమీ మాట్లాడలేదు. తిన్నగా బాత్రూమ్‌కి వెళ్ళాడు. అరగంట స్నానం చేశాడు. బయటకు వచ్చాక భార్య అందించిన వేడి కాఫీ తాగాడు. ఏదో అనబోయిన భార్యని ఆగమని చేత్తో సైగ చేసి, బెడ్రూమ్‌లోకెళ్ళి మంచం మీద వాలిపోయాడు.

పావుగంట అనంతరం ఆనందమూర్తిలో ఎంతో మార్పొచ్చింది. సేద తీరింది. తేలిగ్గా అనిపించింది. అప్పుడే ఏదో భావం మెదిలింది.

గిన్నెడు నేతితో వేడి వేడి ఇడ్లీ, ఉల్లి చెట్నీతో మిరపకాయ బజ్జీలు, ఆనియన్ సలాడ్‌తో చికెన్ జాయింట్ రోస్టు, పూరీతో ఇడ్లీ, సాంబారులో నాని ఉబ్బిన మినపగారెలు, రెండు చెట్నీలు కలుపుకున్న కూరతో మసాలా దోశ, పంచదార పాకంలో ముంచి తీసిన చిలకడ దుంపలు, టమోటా సాస్‌తో చికెన్ పకోడీ ... ఇలా ఎన్నో రకాలు రకరకాల కాంబినేషన్లతో ఎన్నోసార్లు తిని ఆనందాన్నీ, హాయినీ పొందాను కానీ, ఇంత మధురమైన హాయిని నేనెప్పుడూ అనుభవించిన జ్ఞాపకమే లేదు.

ఏమిటీ హాయి? ఎందుకీ హాయి?? ఎలా కలుగుతుందీ హాయి???

చాలా సేపు ఆలోచించాక, రోజంతా కష్టపడిన మనిషికే ఇంత హాయి లభిస్తుందన్నమాట! అలసటలో ఇంత గొప్ప ఆనందం ఉంటుందన్నమాట!! అని అనిపించింది ఆనందమూర్తికి.

ఉపసంహారం

సూర్యోదయం కాకముందే నిద్ర లేస్తున్నాడు ఆనందమూర్తి. ఏమీ ఆలోచించకుండా తదేకంగా, ఆగకుండా, వేగంగా ఏకాగ్రతతో చెమటలు చిందేలా నడుస్తున్నాడు. అలా ప్రతిరోజూ క్రమం తప్పకుండా, బద్ధకించకుండా రోజురోజుకీ నడిచే దూరం, వేగం పెంచుతూ.

అంతేకాదు. ఇంట్లో వండినవే తింటున్నాడు. ఎంత ఇష్టమైనవైనా తక్కువే తింటున్నాడు. ఎంత నోరూరించే తిండి కంటపడినా దృఢచిత్తంతో తల తిప్పేస్తున్నాడు. కడుపు కొద్దిగా ఖాళీగా ఉంగానే చేయి కడిగేస్తున్నాడు.

ఆర్నెల్ల తర్వాత ఒకరోజు ...

"హల్లో ఆనంద్!" అన్న పిలుపు వినిపించి తనను కాదనుకుని అటువైపు చూడకుండా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు. ఎవరో వెనుకనుండి తన చేయి పట్టుకుంటే ఆగి వెనక్కి చూశాడు.

"నిన్నేనయ్యా పిలుస్తున్నది. నిన్ను 'ఆనందమూర్తీ' అని సాగదీసి పిలవడం కష్టంగా ఉంది. 'మూర్తీ' అని పిలిస్తే ఎబ్బెట్టుగా అనిపిస్తోంది. ఆ పేరు నీకు సూటు కాదనిపించింది. 'ఆనంద్' అని పిలిస్తే బాగుంటుందనిపించి అలా పిలిచాను. నీకేమీ అభ్యంతరం లేదుగా?"

అతనివైపే కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయాడు కాసేపు.

"కాదు సార్, ... అలాగే పిలవండి."

తర్వాత ఏవో రెండు మాటలు మాట్లాడి అతను వెళ్ళిపోయాడు.

'మీలా పిలిచేవారుంటే రోజూ ఇలా నడుస్తాను నేను' అక్కడే కాసేపు నిలబడిపోయి మనసులో అనుకున్నాడు. తర్వాత ఏదో కొత్త ఉత్సాహంతో నడుచుకుంటూ వెళ్ళిపోయాడు మూర్తి. సారీ. ఆనంద్!

---

కుటుంబరావు: ఇటీవల మీ ఇంటికి బంధువుల రాక తగ్గింది. ఏం చేశావేంటి?

సురేందర్‌రావు: ఉన్నవాళ్ల దగ్గర అప్పులు చేశాను, లేనివాళ్లకి కొద్దిగా అప్పులు ఇచ్చాను. ఇంకా అడుగుతారని వాళ్లు, ఇవ్వలేమేమోనని వీళ్లు రావడం మానేశారులే.

*అర్చన, మంథరాద, శ్రీకాకుళం.*

